మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# భారీ వర్షాలతో అతలాకుతలం



మహబూబ్‌నగర్ - రాయచూర్ ప్రధాని రహదారిపై వరదనీరు

- మహబూబ్‌నగర్ పట్టణంలో వర్షపు నీరు, డ్రెయిన్ వాటర్ సులభంగా వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చేస్తాం
- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్



లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తున్న మంత్రి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** గడిచిన రెండు రోజుల నుండి మహబూబ్‌నగర్ పట్టణంలో ఎప్పుడూ ఊహించని విధంగా 10.7 సెం.మీ. వర్షపాతం కురియడం వల్ల అతి తక్కువ సమయంలో ఇంత పెద్ద వర్షం కురిసినందున రామయ్యబౌలి తదితర లోతట్టు ప్రాంతాలలోని కొన్ని ఇళ్లలోకి నీరొచ్చిందని, ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ పట్టణంలోని శివశక్తినగర్, హబీబ్‌నగర్, గణేష్ నగర్, బాలాజీనగర్, మేనక టాకీస్, గోల్ మజీద్, రైసా మజీద్, వన్‌టౌన్ ప్రాంతాలలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమై పట్టణంలో రాత్రి అల్మాస్ ఫంక్షన్ హాల్, కురిహినిశెట్టి కాలనీ, బికెరెడ్డి కాలనీలలో ప్రత్యేకించి భారీ వర్షాలకు గురైన వారికోసం షెల్టర్ ఏర్పాటు చేయడం జరిగింది, భోజనాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో మహబూబ్‌నగర్‌లో వర్షాకాలంలో చెరువులో కనీసం చుక్కనీరు ఉండేది కాదని, గడిచిన ఎనిమిది సంవత్సరాల నుండి వర్షం పెరుగుతూ వస్తున్నదని, ఇందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో జిల్లాలో సుమారు 7 శాతం పచ్చదనం పెరిగిందని, దీనివల్ల వర్షాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వర్షాలు వస్తే పట్టణంలో ఇబ్బంది ఏర్పడకుండా వర్షపునీరు, మురికినీరు సులభంగా వెళ్లేందుకు శాశ్వత ప్రణాళిక తయారు చేస్తున్నామని, అండర్ గ్రౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు క్షేమంగా ఉండాలన్నదే తమ అభిమతమని అన్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడవద్దని, ఇళ్లల్లో ఉండకుండా తక్షణమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్స్‌లో ఉండాలని, అక్కడ భోజన వసతి, అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గతంలో మహబూబ్‌నగర్ పెద్దచెరువు 365 రోజులు అలుగు పారేదని, వర్షపునీరు అలుగులో వెళ్లాల్సి తప్ప మరో అవకాశం లేనందున ఆకస్మిక వర్షాల వల్ల ఇబ్బంది ఏర్పడిందని, దీనిని నివారించేందుకు శాశ్వత మార్గం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని, అంతేకాక టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని, ప్రజలను కాపాడేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు అందరు సహకారం అందించాలని అందరి వల్లనే విపత్కర సమయంలో ప్రజలను ఆదుకునేందుకు సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, వైస్ ఛైర్మన్ గణేష్, స్థానిక కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.



ఎ గ్రకుంట చెరువు వద్ద వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి

**బిజెపి నాయకుల సందర్శన...** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ వర్షాల కారణంగా నీటమునిగిన లోతట్టు ప్రాంతాలను శుక్రవారం బిజెపి నాయకులు సందర్శించారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు లోతట్టు ప్రాంతాలను సందర్శించి వరదనీటి బాధితులను పరామర్శించారు. బికె రెడ్డికాలనీ, శివాలయం వెళ్లే రోడ్డులా వరదనీటిని వారు పరిశీలించారు.



బికెరెడ్డి కాలనీలో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న బిజెపి నాయకురాలు డికె అరుణ

## ప్లాస్టిక్ రహిత సమాజం పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

**నారాయణపేట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత కె. రామ్మోహన్‌రావు రచించి ప్లాస్టిక్ రహిత సమాజం పుస్తకాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హరిచందన ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినయోగం వలన పర్యావరణం కాలుష్యం అవుతుందని అందుకే అందరు చైతన్యవంతులై ప్లాస్టిక్ సంచులు వాడరాదని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఎఓ బాలాజీ, డిపిఆర్‌ఓ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత సమాజం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

- పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్ ఉత్తర్వులు
- సస్పెన్షన్‌కాదు షోకాజ్ అంటూ తాపీగా వివరణ
- పంచాయతీ కార్యర్శుల మనోభావాలకు దెబ్బ
- తెలంగాణా జాతీయ వజ్రోత్సవర్యాలీలో ఆకలి కేకలు

# అధికారుల నిర్లక్ష్యం

**నా**గర్‌కర్నూల్ జిల్లాలో కొందరు అధికారులు విదినిర్వహణలో చూపిస్తున్న నిర్లక్ష్యం జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా మారుతుంది. గతకొద్ది రోజులు గావరుసగా జరుగుతున్న పలు సంఘటనలు విదినిర్వహణలో అదికారుల నిర్లక్ష్యం ఉదాసీనతకు అద్దంపడుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గురువారం రాత్రి జిల్లాలోని 36మంది పంచాయతీ కార్యదర్శులు జూనియర్ పంచాయతీ కార్యదర్శిలను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేరున అదికారికంగా ఉత్వర్వులు. ఆతర్వాత కొంత సమయానికి ఆయ్యో పొరపాటు జరిగింది సస్పెన్షన్ కాదు కేవలం షోకాజ్ నోటీసులు మాత్రమే నంటూ పత్రికాప్రకటన పేరున సమాచార శాఖ గ్రూప్‌లో వచ్చిన ఓ బుక్కచిట్టీ పోస్టింగ్ సైతం అధికారుల ఉదాసీనతకు మరో మచ్చుతునకగా మారింది.

*- నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త*

● జిల్లాలోని 36గ్రామ పంచాయతీలలో విద్యుత్ బిల్లులు , బ్యాంకు రుణం ద్వారా గ్రామపంచాయతీలకోసం తీసకున్న ట్రాక్టర్ల నెలవారీ కిస్తులు చెలించడంలో నిర్లక్ష్యం వహించారంటూ 13మండలాలకు చెందిన 36మంది పంచాయతీకార్యదర్శులు జూనియర్ పంచాయతీకార్యదర్శిలను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం కలెక్టర్ పేరున అధికారిక ఉత్తర్వులు వెలువడాయి. ఇందులో గ్రామ పంచాయతీపేరు కార్యదర్శి సస్పెన్షన్‌కు గల కారణం కూడా స్పస్టంగా పేర్కొన్నారు. ఐతే పంచాయతీలలో నిధుల కొరత, ఫ్రీజింగ్, జాయింట్ చెక్‌పవర్ ఉన్న సర్పంచ్ ఉపసర్పంచ్‌ల మధ్య సమన్వయలోపంతోపాటు ఇతర కారణాలతో పంచాయతీ కార్యదర్శిలు ఇఎంఐలు, విద్యుత్ చార్జీలు చెల్లించలేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఇందులో ఏ పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగం గానీ ఇతర తప్పుడు పనులు చేశారన్న అభియోగాలు ఏవీ లేకపోవడం గమనార్హం. ఆవిషయాలను కొద్దిసేపు పక్కన పెడితే కేవలం విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, ఇఎంఐలు కట్టకపోవడం అన్నది సస్పెన్షన్ చేయదగ్గ నేరాలా అన్న చర్చ మొదలైంది. ఇదే క్రమంలో కలెక్టర్ పేరున వెలువడ్డ ఆదేశాలు కొద్దినిమిషాల్లోనే ఫ్లాష్ ఫ్లాష్ అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో చాలా మంది పంచాయతీ కార్యదర్శులు అవమానంగా భావించారు. వారి మనోభావాలు దెబ్బతిన్నాయి. ఆతర్వాత చాలా సేపటికి గానీ జిల్లా పంచాయతీ అదికారి మేల్కొలేదు. ఎట్టకేలకు రాత్రి పొద్దుపోయిన తర్వాత జిల్లా పంచాయతీ అదికారిపేరున ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో పంచాయతీ కార్యదర్శులతోపాటు సంబందిత ఎంపిఇఓలకు, డిఎల్‌పిఓలకు కేవలం షోకాజ్ నోటీసులు మాత్రమే ఇవ్వడం జరిగిందని పొరపాటున షోకాజ్ నోటీస్‌లకు బదులుగా సస్పెన్షన్ ఆదేశాలు అని ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఐతే జిల్లా పౌరసంబంధాల అదికారి గ్రూప్‌లో ఫార్వర్డ్ చేసిన ఈ మెస్సేజ్ సైతం ఓ చిన్న చిత్తుకాగితంపై రాసి జిల్లా పంచాయతీ అదికారి నాగర్‌కర్నూల్ అంటూ ఓ సంతకం చేసి వదిలేశారు. అదికారికమైన లేఖకానీ కనీసం రాసిన బుక్కచిట్టీపై అదికారి ముద్ర కూడా లేకుండా హడావిడిగా నిర్లక్ష్యంగా ఇవ్వడం పైకూడా పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే పనిభారంతో వేదనలకు గురవుతున్న పంచాయతీ కార్యదర్శులు మనోభావాలు దెబ్బతినే విధంగా లిచత పూర్వకంగా ఆదేశాలు ఇచ్చిన అదికారులు తూతూ మంత్రంగా వివిరణ ఇవ్వడం వారి ఉదాసీనతకు నిర్లక్ష్యానికి నిదర్శనమంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టర్ పేరున వెలువడిన పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్ ఉత్తర్వులు



జిల్లా పంచాయతీ అధికారిపేరున వెలువడిన ప్రెస్‌నోట్

**సమైఖ్యతా ఆడంబరం.. అన్నంకోసం ఆరాటం..** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అదికారుల ఉదాసీనత నిర్లక్ష్యానికి ఇటీవల జరిగిన తెలంగాణా జాతీయ సమైఖ్యతా వజ్రోత్సవ ర్యాలీ సందర్భంగా విద్యార్థులు మహిళల్లో వినిపించిన ఆకలి కేకలు మరో నిదర్శనంగా చెప్పుకోవచ్చు. నాగర్‌కర్నూల్ లో నిర్వహించిన ఈ ర్యాలికి నియోజక వర్గం నలుమూలలనుండి విద్యార్థులు, మహిళా సంఘాలు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు అదికారులు పాల్గొన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌నుండి దాదాపుమూడు కిలో మీటర్లపైనా కాలినడకన ర్యాలిగా వచ్చిన వీరంతా సమావేశం పూర్తయ్యేవరకు మండుటెండలోనే ఉన్నారు. 15వేల మంది వస్తారని అదికారికంగా ప్రకటించడమేగాక వారందరికి భోజనం ప్యాకెట్లు అందజేస్తామంటూ గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ఇందుకు దాదాపు 70 కౌటర్లు కూడా ఏర్పాటుచేశారు. ఐతే భోజనం పాకెట్లు సరిపడాసరఫరా చేయకపోవడంతో విద్యార్తులు ,మహిళలు నానా అవస్థలు పడ్డారు. ఆకలితో నకనక లాడుతూ కౌంటర్ల వద్ద దేహీ అంటూ చేతులు చాచి అన్నం ప్యాకెట్ల కోసం అర్థించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు ఆ పక్కనే ఉన్న సాయిగార్డెన్స్‌లో భోజనాలు పెడుతున్నారు వెల్లండంటూ పంపిచారు. అక్కడా తోపులాటే తప్ప భోజనం దొరకలేదు. ఐతే ఈ భోజనకార్యక్రమానికి ఇంచార్జి భాధ్యతలు నాగర్‌కర్నూల్ ఆర్డీఓకు అప్పజెప్పినట్లు తెల్సింది. అక్కడ జరిగిన సభకుసైతం ఆమే ఆద్యక్షురాలు ఐతే ఆమెవేదికపై అధ్యక్షత వహించకపోగా అన్నంకోసం ఆగం అవుతున్న వారికిసమాదానం చెప్పేందుకుసైతం దరిదాపుల్లో కనిపించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యంవ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వఅధికారిక కార్యక్రమంలో ఆకలి కేకలు ఇటు జిల్లా యంత్రాంగానికి, ప్రభుతాన్వనికి సైతం చెడ్డ పేరు తెచ్చినట్లుగా భావిస్తున్నారు.



అన్నం పొట్లాల కోసం ఆరాటం

## భూత్పూర్‌లో ఘనంగా ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు

**భూత్పూర్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కెఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని అడ్డాకుల, కొత్తకోట, దేవరకద్ర, సీసీకుంట, భూత్పూర్ మండలాల నుంచి ముఖ్యనేతలతో పాటు వేలాదిగా కార్యకర్తలు,అభిమానులు తరలివచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులు పట్టణంలోని ఎనిమిది శతాబ్దాల చరిత్ర కల్గిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కారణంగా హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యే ఆల రాక కొంత ఆలస్యం కారణంగ ఫంక్షన్‌హాల్‌లో నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, అభిమానులు ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆల మాతృమూర్తి ఆల వరలక్ష్మమ్మ ప్రారంభించారు. శ్రీరామలింగేశ్వర దేవాలయం లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యేను కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కానుకనందించారు. ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తలు, అభిమానులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే దంపతులను ప్రత్యేకంగా అభినందించి శాలువలు,పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మామిడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,వైస్ ఎంపిపి నరేష్‌గౌడ్,సింగిల్ విండో ఛైర్మన్ అశోక్‌రెడ్డి,జిల్లా మత్స్య సహకార సంఘం పర్సన్ ఇంచార్జి మనెమోని సత్యనారాయణ, ముడా డైరెక్టర్లు సత్తూరు చంద్రశేఖర్‌గౌడ్, మూస సాయిలు, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి అజీజ్, జకీర్, కృష్ణవేణి బాలస్వామి, అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులతో పాటు నాయకులు సత్తూరు నారాయణగౌడ్,తోక మురళీధర్‌గౌడ్, దళితరత్న బోరింగ్ నర్సింహులు, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్,మండి వెంకటయ్య, వడ్ల బ్రహ్మయ్య, అశోక్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాకేష్‌గౌడ్ ఇతర మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యే ఆలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## రైతులు రుణాలు తిరిగి సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

- 1989-2006 మధ్యలో తీసుకున్న ఎల్‌టీ రుణాల మాఫీ ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సొసైటీ నుండి ఎడ్యుకేషన్ లోన్లు.. రుణాల రికవరీలో ప్రగతి సాధించాం
- మహాజన సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి

**పెద్దమందడి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** పెద్దమందడి సహకార సంఘంలో పంట మరియు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు తిరిగి సకాలంలో చెల్లించడం వల్ల మరికొంత మంది రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని పీఏసీఎస్ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో సహకార సంఘం కార్యాలయంలో మహాజన అర్ధవార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణువర్ధన్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. 1989సంవత్సరం నుండి 2006 సంవత్సరం మధ్యలో తీసుకున్న రుణాలపై 35% మాఫీ ని ప్రభుత్వం ప్రకటించిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల 67 మంది రైతులు 1కోటి 77లక్షల 71 వేయ్యి 825 రూపాయలు బాకీ పడగా 62 లక్షల 20వేల 139 రూపాయలు ప్రభుత్వం మాఫీ ప్రకటించిందని ఆయన తెలిపారు. డైరెక్టర్లు రైతులకు అవగాహన కల్పించి రుణాల రికవరీ కి సహకరించాలని సూచించారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుకు సొసైటీ నుండి రుణాలు కూడా ఇస్తున్నామని ఇప్పటికే 2 విద్యార్థులకు రూ.25లక్షల చొప్పున ఇద్దరికి రూ.50 లక్షల రుణం ఇవ్వడం జరిగిందని రాష్ట్రంలో విద్యనభ్యసించే విద్యార్థులకు కూడా రూ.10లక్షల రుణం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గత 2సంవత్సరాల క్రితం ఏర్పడిన నూతన పాలకవర్గం సమయంలో రుణాల రికవరీలో సొసైటీ 50% ఉండగా ప్రస్తుతం 29%నికి సొసైటీ చేరుకుందని ఆయన పేర్కొన్నారు. సహకార సంఘానికి అనువుగా ఉండేందుకు ప్రభుత్వం గోదాం నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో మండల కేంద్రంలో గోదాంల నిర్మాణానికి 2ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ కు నివేదిక పంపడం జరిగిందని అన్నారు. సొసైటీ లో ఆస్థులను తాకట్టుపెట్టి తీసుకున్న రుణాలు అమ్మకానికి(వేలం) కు వెళ్లకమందే రుణాలను చెల్లించాలని ఆయన పిలుపునిచ్చారు. సొసైటీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు రూ.80లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరిగిందని భవిష్యత్‌లో మరికొంత మంది చిరు వ్యాపారులకు సొసైటీ ఆధ్వర్యంలో రుణాలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ కుమార్ యాదవ్, సొసైటీ కార్యదర్శులు బి.జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్,డైరెక్టర్లు గౌని వెంకటేశ్వరన రెడ్డి, రామిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రాంసింగ్, మణ్యంకొండ యాదవ్, అమ్మపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్, మాజీ సర్పంచులు కొండా రవీందర్ రెడ్డి, నాయకులు బుచ్చి లింగం, బాలు, రామేశ్వర్ రెడ్డి, శివారెడ్డి, పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు, డైరెక్టర్లు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి

## బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్రహాం



బతుకమ్మలో ఆటపాట నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**అయిజ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఛైర్మన్ చిన్నదేవన్న ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల ప్రకారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు ఎమ్మెల్యే అబ్రహాం హాజరై బతుకమ్మ ఆటపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప_ంగా ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయంలో భాగంగా బతుకమ్మ సంబరాలు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ నరసింహుడు, కమిషనర్ గోల్కొండ నరసయ్య, పురపాలక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## రాజకీయ మేదవి లేకపోవడం దేశానికి తీరని లోటు

### - జైపాల్‌రెడ్డి క్యాంస విగ్రహావిష్కరణలో పలువురు నేతలు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30,ప్రభాతవార్త :** రాజకీయ మేధావి కేంద్ర మాజీ మంత్రి వర్యులు సూదిని జైపాల్‌రెడ్డి తాను నమ్మిన సిద్ధాంతాలను వద్దులకుండ చివరిదాక ఉన్న మహానేత అని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతరాం ఏచూరిలు అన్నారు. సూదిని జైపాల్‌రెడ్డి లేకపోవడం దేశానికి తీరని లోటు అని వారు పేర్కొన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి పూర్వపు నియోజకవర్గంలోని మాడ్గుల మండల కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహని సుప్రీమ్ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి, శాసనమండలీ ఛైర్మెన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, టీఆర్ఎస్ పార్టీ ఢీల్లీ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, ఎంపి రాములు, సిపిఐ జాతీయనేత అజీజ్‌పాషా, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయా మాజీ ఓబీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ఎంపి మల్లురవిలతో కలసి సీతరాం ఏచూరి విగ్రహ ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ రాజకీయ ఆజాత శత్రువుగా, అందరి వాడుగా, తనకు 50 సంవత్సరాలఅనుబంధంని గుర్తు చేశారు. రాజకీయ విలువలు, సిద్ధాంతలను చివరిదాక వదలని మహానాయకుడు జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం సుప్రీమ్ కోర్టు మాజీ నాయ్యమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహాలు ఎందుకు పెడతారో యువత తెలుసుకోవాలని, వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. యువత జైపాల్‌రెడ్డి విగ్రహని చూస్తు ఎదగాలన్నారు. టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న 12 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టనుందని, హైదరాబాద్ మెట్రో ట్రైన్‌కు జైపాల్‌రెడ్డి పేరు పెడుతామని సూచించారు. గల్లీ నుంచి ఢిల్లీ దాక ఎదిగిన పురటిగడ్డని మరువలేదన్నారు. రాజశేఖర్ రెడ్డి నాగర్జున సాగర్ నుండి హైదరాబాద్‌కు త్రాగునీరు తరలిస్తుంటే మాడ్గుల మండలం ప్రజలు ఫ్లోరైడ్‌తో బాధపడుతున్నారని, కొట్లాడి త్రాగునీరు అందిచారని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ సమస్యతో ఎవ్వరు తానలాగా కావద్దని, మంచినీరు అందించాలని చాలా తపన పడ్డారని, ఆయన చేసిన సేవలను మరువలేనివని కొనియాడారు. మాడ్గుల మండలానికి కరెంట్ పరిచయం చేసింది జైపాల్‌రెడ్డి అని, కల్వకుర్తికి ఎత్తిపోతల ద్వార నీరు అందించాలని ప్రతిపాదనలు చేసి నిధులు కేటయించేవిదంగా కృషి చేశారన్నారు. జాతీయ రాజకీయాల్లో ఉన్న విమర్శలు లేని నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా మెట్రో ట్రైన్‌తో హైదరాబాద్‌ను అభివృదితో పరుగులు పెట్టించారని అన్నారు. దేశరాజకీయలల్లో మచ్చలేని, నిబ్బద్ధత గల రాజకీయ నాయకుడు జైపాల్‌రెడ్డి మాజీ ఎంపి, సిపిఐ జాతీయ నాయకులు అజీజ్‌పాషా అన్నారు. శాసన మండలీ ఛైర్మెన్ గుత్త సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తాను చిన్ననాటి నుండి జైపాల్‌రెడ్డిని చూస్తు పెరిగామన్నారు. ఆయన స్ఫూర్తితో రాజకీయంలోకి వచ్చాన్నారు. తెలంగాణ బిల్లు పాస్ చేయించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఆయన విద్య మొత్తం నల్గొండ జిల్లా దేవరకొండలో కొనసాగిందని, కాబట్టి ఇటివల 80లక్షల నిధులతో గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. జైపాల్‌రెడ్డి విగ్రహని పార్లమెంట్‌లో పెట్టాలని నాగర్‌కర్నూరు ఎంపి పోతుగంటి రాములు అన్నారు. ఉత్తమ పార్లమెంట్‌రియన్ దేశనికి ఎనలేని సేవలు అందించిన నాయకుడి విగ్రహం పార్లమెంట్‌లో పెట్టే విధంగా కృషిచేయలన్నారు. దేశ రాజధానిలో జైపాల్‌రెడ్డి అభివృద్ధి కనిపిస్తుందని, జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై జైపాల్‌రెడ్డి విగ్రహం పెట్టాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. పాలమూరు ఎత్తిపోతలకు జైపాల్‌రెడ్డి నామకరణం పెట్టే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రస్తుత రాజకీయలను దృష్టిలో ఉంచుకుని కుటుంబాన్నిరాజకీయలకు దూరంగా ఉంచారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల కోసం జైపాల్‌రెడ్డి ఎనలేని సేవలు అందిచారని తన శాఖలో బిసిలకు రిజర్వేషన్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్సీ యాదిరెడ్డి, ఆంధ్రమేదవుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రావ్, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలీ శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మెన్ ఠాకూర్ బాలాజీ సింగ్, టిపిసిసి కార్యదర్శి సూదిని రాంరెడ్డి, శివకుమార్,మైసిగండి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ యద్మసత్యం, వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వెల్దండ గ్రామ కోఆప్షన్ సభ్యులు యెన్నం కృష్ణారెడ్డి, కల్వకుర్తి సిల్వర్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు చింతల వెంకటరమణారెడ్డి, వెల్దండ మండల పీఏసీఎస్ ఛైర్మన్ జూపల్లి భాస్కర్‌రావ్‌తో పాటు పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.



కేంద్రమాజీ మంత్రి వర్యులు, కీ।।శే।। సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహని అవిష్కరిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

## 8న రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కార అవార్డులు

### - జిల్లా రజక ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య



**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా రజక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 8న వనపర్తి జిల్లా కు సంబందించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభ పురస్కార అవార్డులు అందజేయబడును. ఎస్ఎస్‌సీ లో 9.5 జీపీఎ ఆపైన ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత మార్కులు 85%, ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, మెడిసిన్ నందు సీటు వచ్చిన వారందరికి రజక ఉద్యోగుల సంఘం నుండి ప్రతిభ పురస్కార్ అవార్డులు ఇవ్వబడును. విద్యార్థులు తన మార్కుల మెమో వివరాలతో ఈ క్రింది నెంబర్ లకు వాట్సప్ ద్వారా పంపి సమాచారం అక్టోబర్ 6 వరకు మాకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. రజక ఉద్యోగుల సంఘం వనపర్తి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి 9347843941, 9440120510, నెంబర్ లకు వాట్సప్ చేయాలని తెలియజేశారు.

## టీడీపీ కార్యకర్త మృతికి మాజీ జడ్పీటీసీ వెంకటయ్య యాదవ్ సంతాపం

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గం జిల్లాలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పేపర్ రాములు మృతిపై టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం పేపర్ రాములు మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి మృతుడు పేపర్ రాములు కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి పరామర్శిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పేపరన రాములు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా తెలిపారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం రావుల మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకటయ్య యాదవ్ చేత రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పంపించి అందజేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెంకటయ్య యాదవ్ వెంట తెలుగు దేశం పార్టీ నాయకులు దత్తాత్రేయ, బాలయ్య, గోడుగు వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ వెంకటయ్య యాదవ్

## కల్వకుర్తి పీఏసీఎస్, డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** కల్వకుర్తి పీఏసీఎస్ డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాబార్డ్ డీజీఎం షణ్ముఖ చారి, డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్యలు హాజరై రైతులకు అవసరమైన దీర్ఘ కాలిక రుణాలు, పంట రుణాలు, వాటిని సకాలంలో చెల్లించకపోతే కలిగే నష్టాలు, విధి విధానాలు, రైతులు బ్యాంక్ మరియు సొసైటీలో డిపాజిట్ చేసిన కలిగే లాభాల గురించి వివరించారు. రైతులు సింగిల్‌విండో ద్వారా పొందిన రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్యాంసుందర్, డైరెక్టర్లు రాముకునాయక్, దేశం పుల్లారెడ్డి, ఫరీద్, రైతు సమితి అధ్యక్షులు వర్కాల భాస్కర్‌రెడ్డి, కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు కుంభం భీమయ్య, గొర్రె కాపరుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్లు బోజిరెడ్డి, చైతన్య కిశోర్‌రెడ్డి, నూనె యాదమ్మ శ్రీనుయాదవ్, సీఈఓ వెంకట్‌రెడ్డి రైతులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్మ సత్యం

## కంసాన్‌పల్లిలో ఆసరా పింఛన్ల కార్డుల పంపిణీ

**ఉప్పునుంతల సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని కంసాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ లక్ష్మినారాయణ అధ్యక్షతన పింఛన్ల కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంపిణీ కార్యక్రమానికి ఎంపిపి అరుణా నర్సింహారెడ్డి, ఎంపిడిఓ విజయభాస్కర్‌లు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 57 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య, వితంతు, ఒంటరి వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని వేర్వురుగా ప్రసంగించారు. సర్పంచ్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ తమ గ్రామంలో కొంతమంది అర్హులైన వారికి పింఛన్లు మంజూరు కాలేదని వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ కార్యదర్శి రాజేశ్వర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపిడిఓ విజయభాస్కర్

## శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**ఉప్పునుంతల, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 5వ రోజు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమివ్వడంతో భక్తులు పూజలు నిర్వహించారు. ఉప్పునుంతలలోని శ్రీ కేదారేశ్వర ఆలయం, కంసాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మండపాలలో భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి బంగారు వర్ణం రంగు చీరతో అలంకరించి పెసరి బూరెలు, పులిహోరతో నైవేద్యం సమర్పించారు. ఆలయ పూజారి శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తుల కట్ట సుగుణమ్మ, తుమ్మల అనిత, సుమలత, కొత్త నారాయణమ్మ, బందం హైమావతి, రమాదేవి, కల్పన, కట్ట లక్ష్మమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.



శివాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

## రిజర్వేషన్ల సాధనకై ఎరుకల అమరవీరుల త్యాగం మరువలేనిది

**మక్తల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణలో ఎరుకల జాతికి ఎస్టీ రిజర్వేషన్ సాధించిన రోజు అయిన సెప్టెంబర్ 30ను తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నారాయణపేట జిల్లా కమిటి ఆధ్వర్యంలో మక్తల్ పట్టణ కేంద్రంలో ఎరుకల అమరవీరులకు నివాళు లర్పించారు. నారాయణపేట జిల్లా అధ్య క్షుడు పాతపల్లి నర్సింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎరుకల తెగలకు అవలంబించిన తీరుని ఆంధ్ర రాష్ట్ర ప్రాంతంలో ఎస్టీ తెగలుగా తెలంగాణ రాష్ట్రంలో బిసిగా మరొక విధానంగా అవలంబించిన తీరు శోచనీయమని ఎరుకల అమరవీరులు మన సంఘం పక్షాన 20 సంవత్సరాలు సుదీర్ఘ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాట ఫలితంగా ఎస్టీ రిజర్వేషన్లు 1976 సెప్టెంబర్ 30 రిజర్వేషన్ సాధించడం జరిగిందని తెలుపుతూ ఏకలవ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ మొగులప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా సహ కార్యదర్శి నాగరాజు, హన్మంతు, కర్నె వెంకటప్ప, కొండప్ప, వెంకటయ్య, యువకులు పాల్గొన్నారు.



ఎరుకల అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

## మొరం వేసి చేతులు దులుపుకున్న అధికారులు

**నారాయణపేట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** గత 15 రోజుల కిందట కురిసిన వర్షాలకు నారాయణపేట నుండి కోటకొండ, ఆర్అండ్‌బి టిరోడ్ తీవ్రంగా దెబ్బతింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నాయకులు రోడ్డు దెబ్బతిన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఆర్అండ్‌బి శాఖ అధికారులతో మాట్లాడితే ఆర్అండ్‌బి ఉన్నత అధికారులు హడావిడిగా రోడ్డును బాగు చేస్తున్నట్లుగా మొరం వేసి చేతులు దులుపుకున్నారు తప్ప అక్కడ గుంతను పూడ్చలేకపోయారు. మళ్లీ గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో మళ్లీ యధారాజా తథా ప్రజా అన్నట్లు రోడ్డు పరిస్థితి అలాగే తయారైంది. ఆ రోడ్డుమీద ప్రయాణం చేయాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆర్అండ్‌బి ఉన్నతశాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డును బాగు చేయాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కోటకొండ అభంగాపూర్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుపక్కన మొరం వేసి వదిలేసిన అధికారులు

## ధనలక్ష్మి దేవీ అలంకరణలో దర్శనమిచ్చిన వాసవీమాత

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** దేవీ శరన్నవరాత్రోత్సవాలను కల్వకుర్తిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బచ్చు భాగ్యలక్ష్మి మురళీ కుటుంబ సభ్యులు శ్రీవాణి రాకేష్, మణిదీప్ చంద్ర, మహేశ్వరి, దినేష్, జూలూరి అరుణ శంకరయ్య కుటుంబ సభ్యులు వినిల్ కృష్ణ, వినయ్ బాబు, ఆకుతోట మాధవి రాఘవేందర్ కుటుంబ సభ్యులు అమ్మవారిని ధనలక్ష్మి దేవిగా అలంకరింపజేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ వాసవీమాత అనుగ్రహానికి ప్రతి ఒక్కరు పాత్రులు కావాలని ఆయన పేర్కొన్నారు. అచల లోక పావనిగా వాసవీమాత భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదించునని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. అమ్మవారికి, పరివార దేవతలకు అభిషేకాలు, ప్రాత:కాల పూజలనుఆలయ పండితులు నిర్వహించారు. దంపతులచే అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండింతులచే వేద పారాయణం, బాలబోగము కార్యక్రమాలు చేపట్టారు. గీత ప్రచార సమితి కల్వకుర్తి బృందం ఆధ్వర్యంలో భగవద్గీత, విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా, సామూహిక పారాయణాలు చేపట్టారు. సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, దేవతలందరికి హారతి, మహానైవేద్యముల సమర్పణ, ప్రసాదవితరణ, భక్తులందరికి భోజన కార్యక్రమము, శ్రీ గురు రాఘవేంద్ర నాదస్వర బృందం వాసవి దేవాలయం వారిచే నాదస్వర విన్యాసం, కోలాటములు, దాండియా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రదోష పూజలు, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణల కార్యక్రమాలను భక్తులకు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చిత్తరంజన్‌దాస్‌ను ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు కంది ప్రవీణ్‌లు శాలువాతో సన్మానించి మెమెంటోను బహుకరించారు.. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు నారాయణ రాజు, దుగ్గి వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, అదనపు కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, గోపాల్, వాస శేఖర్, మిల్లర్లు సభ్యులు మండల, పట్టణ అర్యవైశ్య సంఘం, అవోపా మరియు ఆర్యవైశ్య, యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీక్లబ్ మరియు వాసవి వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారు



చిత్తరంజన్‌దాస్‌ను సన్మానించి మెమెంటోను బహుకరిస్తున్న దృశ్యం

## ప్రజలందరు స్వచ్ఛభారత్‌ను దినచర్యగా చేసుకోవాలి

### - ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఆగుపోగు కుమార్

**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా 17 సెప్టెంబర్ నుండి అక్టోబర్2 వరకు సేవాపక్షంలో భాగంగా ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష పిలుపుమేరకు గురువారం వనపర్తి పట్టణంలోని అమ్మచెరువు దగ్గర బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఆగుపోగు కుమార్ ఆధ్వర్యంలో గంగాశుద్ధి స్వచ్ఛభారత్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఆగుపోగు కుమార్ మాట్లాడుతూ దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు తరుచూ అనారోగ్యం పాలవుతుండడాన్ని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో గమనించిన ప్రధాని మోదీ ప్రధాన మంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. దేశవ్యాప్తంగా మరుగుదొడ్ల సౌకర్యం లేని కోట్లాది కుటుంబాలకు స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్లు కట్టించి బహిరంగ మలవిసర్జన గ్రామాలుగా తీర్చిదిద్దిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేనని గుర్తు చేశారు. సమాజంలోని ప్రతి కుటుంబంలోని ప్రతి వ్యక్తి కూడా రోజూవారి దినచర్యలో స్వచ్ఛభారత్ కూడా ఒక దినచర్యగా అలవాటుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు కొమ్ము సామేలు, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేతూరి బుడ్డన్న, జిల్లా అధికార ప్రతినిధులు గొర్ల బాబురావు, కార్యదర్శి పరుశురాం, జిల్లా కార్యవర్గ సభ్యులు ద్వారపోగు సుబ్రమహ్మణ్యం సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కొండన్న, బొడ్డుపల్లి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు బోయల రామ్మోహన్, సోషల్‌మీడియా మహేందర్ పాల్గొన్నారు.



అమ్మచెరువు దగ్గర స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

## దేవరకద్రలో ఘనంగా ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు



దేవరకద్ర రైల్వేస్టేషన్ ఏరియాలో కేక్‌కట్ చేస్తున్న జెట్టి నరసింహ్మారెడ్డి



కేక్‌కట్‌చేస్తున్న యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్

**దేవరకద్ర రూరల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ పార్టీ నాయకులుఅత్యంత ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకొన్నారు. అలాగే స్థానిక పిహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్‌ల అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఏరియాలో నాయకుడు కొండ భాస్కర్‌రెడ్డి అధ్వర్యంలో ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఓ అభిమాని ఎమ్మెల్యే ఆల పేయింటింగ్ వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**గ్రామాలలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు..** పార్టీ యూత్ నాయకులు యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి, సయ్యద్ జకీ, హన్మంతు, నవీన్, సాయికిరణ్‌ల అధ్వర్యంలో ఎమ్మెల్యే ఆలకు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూగా జిల్లా కార్యవర్గసభ్యుడు కర్ణంరాజు, సత్యంసాగర్, వీరప్పయ్య దేవస్థానం చైర్మెన్ శివానంద్, దేవరకద్ర పిఏసిఎస్ చైర్మెన్ దోకూర్ నరేందర్‌రెడ్డి, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్‌పాష, కొండారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొల్లంబాల్‌రాజ్, మెడికల్‌షాపు రాము, బీసు శ్రీనివాస్‌రెడ్డి, ఉస్కిళ్ళ వెంకట్రాములు, దొబ్బలి అంజనేయులు, రాధాకృష్ణ, గౌస్, ఖాజాపాష, గౌస్, బైద్లరాములు, హన్మిరెడ్డి, పాష, ఆల సైనికుడు హజ్జులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘంలో పంట రుణాలు

**ఖిల్లాఘనపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పంట రుణాల చెక్కులను పీఏసీఎస్ చైర్మెన్ కసిరెడ్డి మురలీధర్ రెడ్డి అందజేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మహాజన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘంలోని 25 మందికి రూ.18లక్షల పంట రుణాల చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధి కొరకు రూ.40లక్షల పంట రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఎల్‌టీ మార్ట్గేజ్ రుణాలు, గొర్రెలపై, డైరీ కోసం, ట్రాక్టర్లకు కొత్త ఇండ్ల నిర్మాణం పై రుణాలు అందజేస్తామని తెలిపారు. రైతులు సకాలంలో పంట రుణాలను వడ్డీలను చెల్లించి మిగతా రైతులకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. 4వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం కోసం సహకార సంఘం ఆధ్వర్యంలో దరఖాస్తు చేశామని అన్నారు. పై అధికారుల నుండి ప్రతిపాదనలు వచ్చిన వెంటనే గోదాం నిర్మాణం చేపడతామని అన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం సహకారం సంఘం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. సకాలంలో రైతులకు యూరియా బస్తాలు, ఫర్టిలైజర్ సబ్సిడీ పై పంపిణీ చేస్తామని అన్నారు. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. సింగిల్ విండో ద్వారా రాబోయే రోజుల్లో రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి బిక్యా నాయక్, డైరెక్టర్స్ కృష్ణయ్య, వాల్యా నాయక్, గోవిందు, సీఈఓ ప్రకాష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పంట రుణాల చెక్కుల అందజేస్తున్న దృశ్యం

## చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారాన్ని అందివ్వాలి

**వీపనగండ్ల, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** 1-6 సంవత్సరాలు కలిగిన చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే వారికి పోషక విలువలు ఎంతో అవసరమని వీపనగండ్ల జడ్పీటీసీ మాధూరి కిరణ్ గౌడ్, ఎంపీపీ కమలేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ అంగన్వాడీ పెబ్బేరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషకమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అవగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొని చిన్న పిల్లలకు పోషక పదార్థాలను అందించే విధానాన్ని తెలిపారు. అతిథిగులుగా ఎంపీపీ, జడ్పీటీసీ పాల్గొని మాట్లాడారు గ్రామీణ ప్రాంతంలో చిన్న పిల్లలు సరైన పోషక విలువలు లేనటువంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లను ఏర్పాటు చేసి అక్కడ వారికి కావలసిన సదుపాయాలతో పాటు మంచి ఆహారాన్ని అందివ్వడం జరుగుతుందని అందులో తమ పిల్లలను చేర్పించాలని వివిధ గ్రామాల్లోని తల్లిదండ్రులకు వారు విజ్ఞప్తి చేశారు. ఈనెల 1నుండి 30వరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద పోషక మాసం నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అంగన్వాడీ సెంటర్ కు ప్రభుత్వం అందించే బాలామృతం ఇవ్వడం జరుగుతుందపి వారు అన్నారు. ఈ సమావేశానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ ఆడారు. అంగన్వాడీ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పెబ్బేరు ఉపాధ్యాయులు ఎస్.కమల, సుగుణ బాయి, ఎల్లమ్మ, డి.సువర్ణ తో పాటు సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మెంబర్ సీహెచ్ సాయిబాబా, వీపనగండ్ల ఎంపీటీసీ గుండ్ల భాస్కర్ రెడ్డి, తూముకుంట సింగిల్‌విండో అధ్యక్షుడు రామన్ గౌడ్, మండల రైతు బంధు అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, టీఆరఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య అలియాస్ వైఎస్ పాల్గొన్నారు.



పోషక మాస సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

## మన ఊరు మన పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చుకుందాం..

### -ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌లాల్

**వెల్దండ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** మన ఊరు మన పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చుకుందామని ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌లాల్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎంజీ కాలనీ తాండ, అల్లంతోటబావితాండ సర్పంచ్‌లు కుమార్, శంకర్‌నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మోహన్‌లాల్ మాట్లాడుతూ మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు అయితే రోగాలకు దూరంగా ఉంటామన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో ఎట్టి పరిస్థితుల్లో నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ద్వారా చెత్తను సేకరిస్తున్నామని, ఇంటి ఆవరణలో, పరిసరాల్లో చెత్తను పడవేయవద్దని వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాలు చేపడుతున్న దృశ్యం

## అత్యవసర సమస్య పరిష్కారానికి కృషి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని 1వ వార్డు విద్యనగర్ కాలనీలో గత 4 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టున ఉన్న ఇండ్లు వర్షంలో నీటిలో మునిగి అక్కడి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం గురువారం రాత్రి అట్టి ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం తాత్కాలిక పరిరక్షణ కోసం ముందున్న భూ యజమానులతో మాట్లాడి నిలిచిన నీటిని తొలగించేందుకు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం చర్యలు చేపట్టారు. కాలనీలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు మున్సిపల్ చైర్మన్‌కు వార్డు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇలియాజ్, శ్రీరాములు, మన్సూర్, కృష్ణవేణి, శారద, కాలనీ వాసులు, మున్సిపల్ ఏఈ శివ, కృష్ణ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

## ఆశకార్యకర్తలకు యూనిఫామ్ చీరల పంపిణీ

**పాన్‌గల్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండలంలోని గ్రామాల ఆశాకార్యకర్తలకు యూనిఫామ్ చీరలను మండల వైద్యాధికారి డా.రాజశేఖర్, డా.ప్రణీల లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ప్రజల ఆరోగ్యంపై ఆశాకార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా గర్భిణీలకు ప్రతినెల వైద్య పరీక్షలు జరిపించేందుకు కృషి చేయాలని అన్నారు. గర్భిణీల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు జరిపించుకునే విధంగా గర్భవతులకు అవగాహన కల్పించాలని, టీబీ వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాసులు సూపర్ వైజర్ సంతోషమ్మ, వైత్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆశకార్యకర్తలకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## నేడు పెద్దమందడిలో బతుకమ్మ సంబరాలు

### - ఎంపీపీ తూడి మేఘారెడ్డి, ఎంపీడీఓ అబ్జలుద్దీన్

**పెద్దమందడి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం 3గంటలకు బస్టాండ్ ఆవరణలో మండల స్థాయి బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తూడి మేఘారెడ్డి, ఎంపీడీఓ అబ్జలుద్దీన్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి మహిళలు అధిక సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, అంగన్వాడీ లు, మహిళా సంఘాల సభ్యురాల్లు, బతుకమ్మ ను తీసుకొని ఉత్సవాల్లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా 3బహుమతులను ఎంపిక చేయడం జరుగుతుందని అందంగా బతుకమ్మ ను తయారుచేసుకొని వచ్చిన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులను ఇవ్వడం జరుగుతుందని మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతి గా రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2వేల నగదును ఇవ్వడం జరుగుదుంని వారు పేర్కొన్నారు. అందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఎంపీపీ తూడి మేఘారెడ్డి

## మృతి చెందిన గిరిజన కుటుంబాలకు జీయాగూడ అధ్యక్షులు పరామర్శ

**వెల్దండ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదమ్మబండ తాండకు చెందిన గిరిజన మహిళలు రుక్మిణి, నాన్కులు గత మూడు రోజుల క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. మృతురాల కుటుంబాలను జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ పరామర్శించి ఒక్కొ కుటుంబానికి రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జంగయ్యయాదవ్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అపర్ణ తిర్మల్‌రావు, ఉప సర్పంచ్ రాజునాయక్, మాజీ సర్పంచ్ లాలునాయక్, వెంకటేష్ ముదిరాజ్, మురళీ, కొండలుతో పాటు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న జీయాగూడ అధ్యక్షులు

## మృతి చెందిన జాతీయ పక్షి నెమలిని ఫారెస్ట్ అధికారులకు అప్పగింత

**వెల్దండ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీలోని కొబ్బరికొండగుట్ట వద్ద మృతి చెందిన జాతీయ పక్షిని శుక్రవారం గ్రామంలోని యువకులు గుర్తించి స్థానిక సర్పంచ్ అంజినాయక్‌కు సమాచారమివ్వడంతో ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ రేణుకకు సమాచారమివ్వగా... ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి చేరుకొని మృతి చెందిన నెమలిని స్వాధీనపర్చుకొని పోస్టుమార్టం నిమిత్తం పశువైద్యాధికారిలకు అప్పగించారు. పోస్టుమార్టం నివేధిక అనంతరం నెమలి మృతి చెందిన వివరాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేష్, శ్రీను, భాస్కర్, వెంకటియా తదితరులు ఉన్నారు.



చనిపోయిన నెమలిని అప్పగిస్తున్న దృశ్యం

## యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి

**వెల్దండ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** యువకులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన యువకులకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ క్రిట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయక్, బాల్‌రెడ్డిలు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, దేహదారుడ్యాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, కొండలుయాదవ్, జగన్, గోపాల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

### - రాయపల్లి గ్రామసర్పంచ్ గంగాధర్‌గౌడ్

**రాజాపూర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** రాయపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ఆడపడుచులకు దసరా కానుకగా ఇస్తున్న చీరలను శుక్రవారం గ్రామ పంచాయతీ దగ్గర రాయపల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల గంగాధర్‌గౌడ్ మహిళలకు ఇవ్వడం జరిగింది. అలాగే కొత్తగా వచ్చిన ఆసరా పెన్షన్ కార్డులను కూడా అందరికి ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయడం లేదని టిఆర్ఎస్ ప్రభుత్వం మన తెలంగాణలో అమలు చేయడం అనేది మన అదృష్టమని రాయపల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల గంగాధర్‌గౌడ్ తెలిపారు. ఇలాంటి మన ఇంటి పెద్దన్న అయిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు మన జడ్చర్ల నియోజకవర్గం ముద్దుబిడ్డ, జడ్చర్ల ఎమ్మెల్యే చర్లకోళ్ల లక్ష్మారెడ్డి, రాయపల్లి గ్రామం తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరెళ్ల గంగాధర్‌గౌడ్, డిప్యూటి సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి రవిప్రకాష్, మాజీ సర్పంచ్ నరసింహులుగౌడ్, టిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, గ్రామ రైతు సమన్వయ కమిటి అధ్యక్షులు మాధవరెడ్డి, స్టాండింగ్ కమిటి మెబబర్ ఉదేష్‌గౌడ్, యువత అధ్యక్షులు మహేష్‌గౌడ్, కారోబార్ నరసింహులు, విఎఓ మల్లేష్‌గౌడ్, డీలర్ రాములు, పాలెం చెన్నయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం...

**కల్వకుర్తి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కల్వకుర్తి నియోజక వర్గంలోని మాడ్గుల మండలంలోని జీ.హరీష్ రూ.9500లు, పోచమ్మ రూ.14500లు, వెంకటయ్య రూ.27వేలు,జే.జంగయ్య రూ.60వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీ పోతుగంటి రాములు, జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లతో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం సీఎం కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. అదే విధంగా మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లో ప్రతిష్టించిన దుర్గామాతల వద్ద ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దుర్గామాత మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం తాడూర్ మండలం ఆకునెల్లికుదురు రోడ్డుపై నుండి ఉధృతంగా పారుతున్న కాలువను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేసి ఎవరు రోడ్డు దాటకుండా కాపలా పెట్టాలని ఆదేశించారు. ఇంకో రెండు రోజులు ఇదేవిధంగా వర్షాలు ఉన్నందున రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణహాని కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాల వల్ల బాగా నాని కూలేందుకు సిద్దంగా ఉన్న ఇళ్లను గుర్తించాలని, అందులో ఉంటున్న ప్రజలను అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలకు ఎవరు వెళ్లవద్దన్నారు. జలాశయాలు పొంగి నీరు వచ్చే రహదారులు, బ్రిడ్జిలు, కాజ్‌వేలు, వాగులు, వంకలు, చెరువులను గుర్తించాలన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా బృందాలను నియమించి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూం. నం.08540-230201కు తెలపాలన్నారు. ఎంపిడిఓలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు అప్రమత్తమై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సహాయ సహకారాలు అందజేయాలని ఆదేశించారు.


రోడ్డుపై పారుతున్న కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదు

### - రాజాపూర్ మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులు

**రాజాపూర్, సెప్టెంబరు, 30 , ప్రభాతవార్త:** టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి వర్యులు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని టీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ వింగ్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కొందరు నాయకులు వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని, అలాంటివి మానుకోవాలని అన్నారు. తమ నాయకున్ని విమర్శించే ముందు స్థాయిని కూడా తెలుసుకోవాలన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నిందలు వేస్తున్నారే కాంగ్రెస్ పార్టీ నాయకుల వల్ల ప్రజలకు ఎలాంటి లాభం చేకూరదన్నారు. ఇకముందు తమ నాయకునిపై నిందలు వేస్తే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ యూత్ వింగ్ మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్, ఏఎంసీ డైరెక్టర్ వనపర్తి దేవేందర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, రాచమల్ల యాదగిరి, శ్రీనివాస్ నాయక్, బైండ్ల నర్సింహ్మ, విజయ్, రామకృష్ణ, సున్నపు శ్రీనివాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.


రాజాపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## పీఎంపీలు పద్ధతి మార్చుకోండి లేనిచో చర్యలు తప్పవు

### - జిల్లా పరిపాలన అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి

**పెబ్బేరు,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పీఎంపీ డాక్టర్లుగా కొనసాగుతున్న గ్రామీణ వైద్యులు పరిధికి మించి రోగులకు పరీక్షలు నిర్వహించడంతో రోగులకు తీవ్ర అనారోగ్య సమస్యలతో పాటు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం అందింది. దీంతో అధికారులు విభాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం పెబ్బేరు మండల కేంద్రంలో డా.సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పీఎంపీ డాక్టర్లు నిర్వహిస్తున్న క్లినిక్ లను పరిశీలించారు. తనిఖీల్లో ఆశ్చర్యకరమైన విశేషాలు ఏమిటంటే రెండు సంవత్సరాల క్రితం పరిధికి మించి రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారని గతంలో పనిచేసిన డీఎం అండ్ హెచ్ఓ శ్రీనివాసులు కు తీవ్ర హెచ్చరిక జారీ చేసి సక్రమంగా ఉండనిచో క్రిమినలన కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ తీరు మార్చుకోలేదు. గత రెండు సంవత్సరాలుగా అధికారులు ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడంతో మళ్లీ అదే తీరు కొనసాగింది. మండల కేంద్రంలోని పీఎంపీ వైద్యుదు తన క్లినిక్‌లో 2 రోగులకు సెలూన్ బాటిల్ ఎక్కిస్తూ రెడ్ హ్యాండెడన గా పట్టుబడ్డాడు. గమనించిన డా.సాయినాథ్ రెడ్డి ఇలా చేస్తే రోగులకు ఏదైనా ప్రమాదం వస్తే ఎవరు బాద్యులని వైద్యుని పై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇలానే చేశారని జిల్లా వైద్యశాఖాధికారులు గుర్తు చేశారు. ప్రముఖ వైద్యుల అవతారం ఎత్తి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వారికి అధిక ధరలైన ఆంటీబయోటిక్స్ మందులను కూడా రాస్తున్నారు. ఈ విషయాలన్నీ తమ దృష్టికి వచ్చాయని వైద్య అధికారులు తెలిపారు. అనంతరం నిబంధనలకు విరుద్దంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రిని సీజ్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ వెంకటసాయి, సరోజిని ఆసుపత్రులను వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని సొమ్ము చేసుకుంటున్నారు. ఇకపై నిబంధనలకు విరుద్దంగా పరిధికి మించి పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి హెచ్చరించారు. తనిఖీలో వైద్య సిబ్బంది నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


వైద్యుడిని హెచ్చరిస్తున్న జిల్లా పరిపాలన అధికారి డా.సాయినాథ్ రెడ్డి

# మారని తీరు...

### - అధికార కార్యక్రమాల్లో సతీ స్థానంలో పతి...
### - నిద్రావస్థలో ఉన్నతాధికార యంత్రాంగం...
### - నిస్సాహాయ స్థితిలో మండలాధికారులు...


ఉల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భర్త లాలుయాదవ్


వెలుమలపల్లిలో బతుకమ్మ చీరలు, ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీలో ఎంపీపీకి బదులుగా ఎంపీపీ భర్త లాలుయాదవ్

**వంగూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** అధికార పార్టీ అండదండలు ఉంటే... పల్లెల్లో సతుల స్థానంలో పతులు రాజ్యమేలవచ్చు..! ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటిస్తూ అధికారులతో కలిసి ప్రజా ప్రతినిధులు పాలు పంచుకొని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను వివరించేందుకు వెళ్లాల్సింది. కానీ మహిళా ప్రజా ప్రతినిధులు ఉన్న చోట వారి కుటుంబ సభ్యులు పల్లెల్లో, మండల కేంద్రాల్లో మహిళా ప్రజా ప్రతినిధులకు వారి భర్తలు, కుటుంబ సభ్యులు మేమే ప్రజా ప్రతినిధులము అనే విధంగా వ్యవహరిస్తూ కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. అధికారులు సైతం మహిళా ప్రజా ప్రతినిధుల పేర్లు పెట్టి కార్యక్రమానికి వారి భర్తలను ఆహ్వానిస్తున్న తీరును చూస్తే ప్రజాస్వామ్యం మంట కలిసిందా అనే విధంగా కొనసాగుతున్న అధికారుల తీరు వంగూరు మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం వంగూరు మండలం ఉల్లంపల్లి, వెలుమలపల్లి, కిష్టంపల్లి, సర్వారెడ్డిపల్లి గ్రామాల్లో బతుకమ్మ చీరలు, ఆసరా పెన్షన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మకు బదులుగా ఎంపీపీ భర్త లాలుయాదవ్ పాల్గొని తానే స్వయంగా ఎంపీపీగా వ్యవహరిస్తూ అధికారిక కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా మారింది. వంగూరు మండలంలో గత వారం రోజులుగా ప్రభుత్వం ప్రజలకు బతుకమ్మ చీరలు, ఆసరా పెన్షన్ కార్డులు అందించడంలో అధికారులు ముందు వరుసలో ఉండి అందించాల్సింది పోయి మండల మహిళా ప్రజాప్రతినిధి స్థానంలో వారి భర్త గ్రామాల్లో, మహిళా సర్పంచ్‌లకు బదులుగా వారి భర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని తమ ఇష్టానుసారంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వైనం చోటు చేసుకుంటుంది. అధికారం చేతుల్లో ఉంటే... ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా మహిళా ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు వ్యవహరిస్తున్న తీరును మండల స్థాయి అధికారులు వెన్నంటి ఉండి కార్యక్రమాలను కొనసాగించడం మండల ప్రజలు దురదృష్టకరంగా భావిస్తున్నారు. ప్రొటోకాల్‌ను పాటించాల్సిందే అధికారులే నిస్సాహాయ స్థితిలో ఉండి తమ విధి నిర్వహణను అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు, మహిళా ప్రజా ప్రతినిధుల భర్తలకు, కుటుంబ సభ్యులకు లోబడి కొనసాగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారమివ్వకుండా ఆయా గ్రామాల్లో కార్యక్రమాలను చేపడుతున్నారని జిల్లా అధికారులకు సమాచారమందించిన పట్టించుకున్న పాపన పోలేదని వాపోతున్నారు. ఇది ఇలా జరిగితే మహిళలు రాజకీయంగా ఎదగాలని, అభివృద్ధి చెందాలని రిజర్వేషన్లను కల్పించి పురుషులకు సమానంగా సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంపొందించుకొని తమ విలువలు కాపాడుతూ సమాజానికి ఆదర్శంగా నిలిచేందుకు రిజర్వేషన్లు కల్పిస్తే ఎన్నికల్లో గెలుపొంది ఒంటింటికే పరిమితమవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయ పరంగా రిజర్వేషన్లు, సముచిత స్థానం కల్పించి వారి అభివృద్ధికి బాటలు మహిళా ప్రజా ప్రతినిధుల్లో వారే కొనసాగి పాలన కొనసాగించాలని, మహిళా ప్రజా ప్రతినిధుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొని అధికార కార్యక్రమాలు నిర్వహిస్తే సహించేది లేదని ఐటీ శాఖ మాత్యులు, టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహణాధికారి కేటీఆర్ ఎన్నో సమావేశాల్లో సూచించారు. అయిన టీఆర్ఎస్ పార్టీలో గెలుపొందిన మహిళా ప్రజా ప్రతినిధుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులు, భర్తలు రాజ్యమేలుతుంటే...స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా ఏమి పట్టనట్లు వ్యవహరించడం శోచనీయంగా మారింది. వంగూరు మండల ప్రజలు ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు అత్యధిక మెజార్టీని అందించారు. ఈ మండలంలోనే మహిళా ప్రజా ప్రతినిధుల స్థానాల్లో వారి భర్తలు, కుటుంబ సభ్యులు మహిళలను ఒంటింటికి పరిమితం చేసి రాజ్యమేలుతుంటే... మరికొంత మంది టీఆర్ఎస్ పార్టీ పదువుల్లో కొనసాగుతున్న నాయకులు సైతం ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కాకపోవడం చూస్తే... రానున్న రోజుల్లో పార్టీకి గండి పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మండలంలో కొనసాగుతున్న తీరుపై ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చొరవ తీసుకొని మహిళా ప్రజా ప్రతినిధుల స్థానాల్లో వారినే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోకపోతే రానున్న కాలంలో టీఆర్ఎస్ పార్టీకి చేధు అనుభవం ఎదురు కాక తప్పదని పలువురు పేర్కొంటున్నారు. ఇది ఇలా ఉంటే... మండలంలో మహిళా ప్రజా ప్రతినిధుల భర్తలు, కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్న తీరుపై నిస్సాహాయ స్థితిలో ఉండటం వల్ల కనీసం జిల్లా అధికారులు అయిన చొరవ తీసుకొని మహిళా ప్రజా ప్రతినిధుల స్థానాల్లో వారినే కొనసాగించే విధంగా చర్యలు చేపడుతారా లేక అధికార పార్టీకి దాసోహవుతారో వేచి చూడాల్సిందే.

## నిరుపేద విద్యార్థి ఎం.ఆర్ రామకృష్ణకు ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** చదువులో ప్రతిభను కనబరుస్తూ చిన్న చింతకుంట మండల కేంద్రానికి చెందిన కూలి పనులు చేసుకునే నిరుపేద కుటుంబంలో ఎమ్మార్ రామరాజు పుష్పమ్మ దంపతులకు జన్మించిన పేద విద్యార్థి ఎమ్మార్ రామకృష్ణ చిన్నచింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో విద్యాభ్యాసం చేసి 10/10 మార్కులు సాధించాడు. హైదరాబాద్ పట్టణంలోని గౌలిదొడ్డి గురుకుల పాఠశాలలో 981 మార్కులతో ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో 9,600, జెఈఈలో జాతీయస్థాయి ఎస్సీ విభాగంలో 5086 ర్యాంకు సాధించాడు. చిత్తూరు జిల్లా సిటి కాలేజీలో సీటు పొందాడు. విద్యాభ్యాసం చేసేందుకు గాను సంవత్సరానికి రూ. 2 లక్షలు ఖర్చవుతుంది. విద్యార్థి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల వలన కూలీ పనులు చేయడంతో చదివించేందుకు వారికి స్థోమత లేని కారణంగా జడ్పీహెచ్ఎస్ పూర్వ ఉపాధ్యాయులు, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు కలిసి విద్యార్థి చదువుకునేందుకు రూ. 20,500లు ఆర్థిక సహాయం అందజేసినట్లు పాఠశాల జిహెచ్ఎం రామలింగం తెలిపారు. అంతకుముందు విద్యార్థి రామకృష్ణను శాలువాతో సన్మానించారు. విద్యార్థికి ఆర్థిక సహాయం చేసిన ఉపాధ్యాయులలో సుధారాణి, రజిత, వెంకటలక్ష్మి, స్వాతి, శ్రీహరి, చిన్నరాయుడు, రమేష్‌కుమార్, రియాజుద్దిన్, మునీరుద్దిన్, సిరాజుద్దిన్, అజీమ్, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు బి. బాలన్న, రాములు, గోవిందులు ఉన్నారు. విద్యార్థి రామకృష్ణ పై చదువును చదివించేందుకు ప్రభుత్వం కృషి చేసి ఆదుకోవాలని తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జె.మోహన్‌గౌడ్, ఎస్ఎంసి చైర్మన్ సి. రవి, జిహెచ్ఎం రామలింగం, ఉపాధ్యాయులు ముక్తార్, గ్రామస్తులు జిపి శేఖర్, ఎల్ఎం రాజు, వెంకటన్న పాల్గొన్నారు.


విద్యార్థి రామకృష్ణను శాలువాతో సన్మానిస్తున్న గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు

## శతావధానం నిర్వహించడం జిల్లాకే గర్వకారణం

### - జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని చుక్కాయపల్లి శ్రీదేవిచే శతావధానం నిర్వహించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గెలాక్సీ పాఠశాలలో ప్రముఖ అవధాని చుక్కాయపల్లి శ్రీదేవిచే శుక్రవారం శతావధానం నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులుగా రావూరి వనజ, సభాసమనవయ కర్తగా శాంతారెడ్డిలు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి హాజరై అవధానం అద్భుతమైన సాహిత్య ప్రక్రియలలో ఒకటి అన్నారు. గౌరవ అతిథులుగా వల్లపురెడ్డి మనోహరరెడ్డి మాట్లాడుతూ ఈ అవధానంను ఇంతటితో ఆపక 33 జిల్లాల్లో చేయాలన్నారు. డా. పొద్దుటూరు ఎల్లారెడ్డి పూరించిక పద్యాలను శ్రావ్యంగా గంభీరంగా రాగభావ యుక్తంగా చదువుతూ వివరించారు. ఆత్మీయ అతిథులు వల్లాభాపురం జనార్ధన, బాలస్వామి, రాధాకృష్ణ వర్మ హాజరై అవధాన ప్రక్రియ ప్రయోజనాన్ని గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ, కార్యదర్శి శాంతారెడ్డి, కవులు, రచయితలు మాడభూషి రవికుమార్, శ్రీభవన్, రావూరి సూర్య నారాయణ, దుప్పల్లి శ్రీరాములు, కె. లక్ష్మణ్‌గౌడ్, జగపతిరావు, ఊరీశ్వర్‌రెడ్డి, తూపురాణి, వెంకట కృష్ణమాచార్యులు, బాదేపల్లి వెంకటయ్య, దేవదానం, ఖాజామైనొద్దిన్, రాంచంద్రయ్య, సాయిశ్రీ, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి, మానస, గీతారాణి, మమత, సువర్ణాదేవి, జమున, అంబుజ, సుమాల, లక్ష్మయ్య, తూం సుభాస్‌రెడ్డి, జి. రవిందర్‌రెడ్డి, రాములు పాల్గొని సభను విజయవంతం చేశారు.


ప్రముఖ అవధాని చుక్కాయపల్లి శ్రీదేవిని సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్థాయిని మించి మాట్లాడుతున్నరు

### - విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రాజాపూర్, సెప్టెంబరు, 30 , ప్రభాతవార్త:** మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తన స్థాయిని మించి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల నియోజకవర్గ సమన్వయకర్త అనిరుధ్‌రెడ్డిని బూతు మాటలు అనడం సరైన పద్దతి కాదని అలాంటివి మానుకోవాలని రాజాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్, కృష్ణయ్య యాదవ్, కుచ్చర్‌కల్ కృష్ణయ్య, తిర్మలాపూర్ యాదయ్య తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నవాబ్‌పేట్ మండలంలోని కొల్లూరు గ్రామాన్ని మండలం చేస్తానని హామి ఇచ్చి చేయలేదని, దానిని ప్రశ్నిస్తున్నామని, డబుల్ బెడ్రూంల విషయంలో తమ పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని దీనికై ఎమ్మెల్యే తమ నాయకున్ని దుర్భాషలాడడం సరైంది కాదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపండి, నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వండి, గుంతలమయమైన రోడ్లను సరిచేయండి అంటూ తాము చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చూడాలని, అనవసరంగా దుర్భాషలాడడం సరికాదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, దస్రునాయక్, శ్రీను నాయక్, హీర్యనాయక్, శ్రీను, హీరునాయక్, వెంకటేష్, కాంత్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, నర్సింలు, కిషన్ నాయక్, రఘు గౌడ్, జగదీష్‌రెడ్డి, శివకుమార్, జగన్, ధర్మానాయక్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దొండ్లపల్లి కృష్ణయ్య యాదవ్

## 3న నిర్వహించే బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలి

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** అక్టోబర్ 3వ తేదీన నిర్వహించే బతుకమ్మ ఉత్సవాల ముగింపు వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అక్టోబర్ 3వ తేదీన నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల ముగింపు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల25వ తేదీ నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించునున్నట్లు అక్టోబర్ 3వ తేదీన బతుకమ్మ నిమజ్జనం కార్యక్రమంలో జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. వనపర్తి పట్టణ సమీపంలోని నల్లచెరువులో నిమజ్జనం చేస్తున్నందున చెరువు పరిసర ప్రాంతాలు సరీస్ లైట్లతో సుందరీకరణ చేయాలని, పారిశుద్యం పనులు చేపట్టాలని, స్టేజ, డయాస్ సిద్దం చేయాలని, కళాజాత బృందంచే కళాజాత ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. పోలీస్ శాఖ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలనా మె సూచించారు. బతుకమ్మ సంబరాలలో తాగునీరు ఇతర వసతులు కల్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొనాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రోన్ కెమరాలను సిద్దం చేయాలని, మైక్ సిస్టం, డీజే ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. అన్ని శాఖలు సంబరాలకు ప్రజలను తరలివచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బతుకమ్మ సంబరాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నందున ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు ప్రణాళికబద్దంగా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ నల్లచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, డి.వేణుగోపాల్, సీఐ ప్రవీణ్, మున్సిపలన కమిషనర్ విక్రంసింహారెడ్డి, తహసిల్దార్ రాజేంద్ర గౌడ్ పాల్గొన్నారు.


నల్లచెరువు ఆవరణలో పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, సీఐ ప్రవీణ్

## డబూల్ బెడ్రూం బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్,30,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబూల బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామని మోసం చేసిన వారిపై రూరల్ పోలీస్టేషన్‌కు ఫిర్యాదులు వెలివెత్తున్నాయి. గత మూడు రోజుల క్రితం డబూల్ బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామని మోసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసిన విషయం బయటకు రావడంతో ఇండ్ల కోసం డబ్బులిచ్చిన వారంత రూరల్ పోలీసులకు ఫిర్యాదులు చేయాటానికి బారులు తీస్తున్నారు. ఈ క్రమంలోనే బాధితులు ఆకుల కిరణ్ కుమార్,బర్వాడి సుధాకర్,సయ్యద్ కలాంపాషల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసినట్లు సిఐ రాజేశ్వర్‌గౌడ తెలిపారు. 0000 అబ్దూల్ సిరాజ్ నుంచి రూ.2,50 లక్షలు స్వాదీనం చేసుకున్నారు.మహ్మద్ ఇర్ఫాన్ నుంచి రూ.2200,కెసిరెడ్డి నుంచి రూ. 5000 స్వాదీనం చేసుకున్న పోలీసులు సిరాజ్,వనగంటి ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు.ఖాధర పరారిలో ఉన్నట్లు తెలిపారు. ఈ డబూల్ బెడ్రూం ఇండ్ల అక్రమాలపై విచారణ కొనసాగుతునూ ఉందని సిఐ తెలిపారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్ట పరమైన చర్యలతో పాటు న్యాయం చేస్తామని సిఐ తెలిపారు.

## లక్ష్మిదేవి అవతారంలో అమ్మవారు

**రాజాపూర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలోని గుండ్లపొట్లపల్లి గ్రామంలో శుక్రవారం లక్ష్మి దేవి అవతారంలో దుర్గామాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారిని పూజిస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కరు భక్తిభావం పెంచుకుని ముక్తిని పొందాలని కోరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మర్పడ్గ గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాసయ్య, వార్డు సభ్యుడు శంకరయ్య, నర్సింలు, రాజశేఖర్, ఆంజనేయులు, యాదయ్య, యాదగిరి, రాజేశ్వర్‌రెడ్డి, గ్రామానికి చెందిన మహిళలు, అర్చకులు రవిందర్‌చార్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న గోపాల్‌రెడ్డి తదితరులు

## దుర్గామాతకు ఆలయ యువసేన నాయకుల పూజలు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ గంగాభవాని దేవాలయంలో ప్రతిష్టించిన దుర్గామాత వద్ద చిన్నచింతకుంట మండల ఆల యువసేన నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయురారోగ్యాలతో పాటు భగవంతుని ఆశీస్సులతో మళ్లీ అఖండ సాధించాలని చిన్నచింతకుంట మండల ఆల యువసేన నాయకులు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ రియాజ్, వార్డు మెంబర్ సి. వరప్రసాద్, చెన్నకేశవులు,మద్దూరు యూత్ ప్రెసిడెంట్ చాంద్‌పాషా, కురుమూర్తి, యూత్ ప్రెసిడెంట్ దాసరి వెంకటేష్, సంజీవ, వినోద్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఆల యువసేన నాయకులు

## వాగులో కొట్టుకుపోయి యువరైతు గల్లంతు

### - ఇంకా లభ్యంకాని మామిళ్లపల్లి రాఘవేందర్ ఆచూకీ

**తెల్కపల్లి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** వాగులో పడి రైతు గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వి. ప్రదీప్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన యువరైతు మామిళ్లపల్లి రాఘవేందర్ (25) శుక్రవారం మధ్యాహ్నం తన పొలానికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు తాళ్లపల్లి కార్వంగ గ్రామాల మధ్య ఉన్న వాగులో పడి గల్లంతైనట్లు ఎస్సై తెలిపారు.ఎంత వెతికినా ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాలేదని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ పెద్దపల్లి పద్మావతి బంగారయ్య, ఆర్డీఓ నాగలక్ష్మి, ఎంపిపి కొమ్ముమధు, సింగిల్ విండో చైర్మన్ డి. భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండ పర్వతాలు, గ్రామాల సర్పంచ్‌లు భాస్కర్‌గౌడ్, ఎంపిటిసిలు అధికారులు ప్రజా ప్రతినిధులు గల్లంతైన యువరైతు ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.


గల్లంతైన యువకుడు (ఫైల్)

## సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

**బాలానగర్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని చాకలిదానిగుట్ట తండాలో సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సభవత్ శ్రీనివాస్ నాయక్ రూ. 51 వేల విరాళం అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆలయ నిర్మాణ కమిటి నిర్వాహకులకు ఆర్థిక సహాయాన్ని విరాళంగా అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముదావత్ గబ్బునాయక్ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

## ధనలక్ష్మి దేవీగా భక్తులకు దర్శనం

**వెల్దండ, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుర్గామాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక నిర్వహించారు. దేవీ శరన్న వరాత్రోత్స వాల్లో భాగంగా శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వెల్దండ మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ధనలక్ష్మి దేవీ అలంకరణ చేసి వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పాండురంగనాయక దేవాలయంలో భక్తులకు అమ్మవారు ధనలక్ష్మిదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పాండురంగనాయక దేవాలయంలో ప్రతిష్టించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. బుధవారపేట ఆంజనేయస్వామి దేవాలయంలో పూరి వెంకటయ్య భారతమ్మ, జూలూరి మాణిక్యమ్మ బాలస్వామి, జూలూరి లక్ష్మమ్మ ఈశ్వరయ్య దంపతులు అమ్మవారిని ధనలక్ష్మి దేవీ అలంకరణలో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న వారిని ఉత్సవ కమిటీ అధ్యక్షులు పూరి రమేష్ శాలువాలతో సన్మానించి అమ్మవారికి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ గవర్నర్ కల్వ హరికృష్ణ, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, పీఆర్ఓ మిర్యాల రాజయ్య, సభ్యులు వజ్రలింగం, రమేష్, నీలలింగం, కుమారస్వామి, సంతోష్, జూలూరి బాలస్వామి, కుమారస్వామి, జూలూరి ఈశ్వరయ్య, అనిల్, సైదులు, కిరణ్, నరేందర్‌గౌడ్, వీరయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.


పాండురంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యెన్నం భూపతిరెడ్డి